

రేపటి నుంచి బీఆర్‌ఏయూలో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 17 నుంచి 21 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్-2024కు హాజరై, అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారికి ఎలాంటి రాయితీలు వర్తించవన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ రుసుం రూ.500 చెల్లించాలన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు సర్టిఫికెట్లతో వర్సిటీలోని ప్రిన్సిపల్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.



ఒడిశా రాష్ట్రం మహానది నుంచి పలాసకు తెప్పించుకున్న ఇసుక

పలాసకు చెందిన ఎం.నాగభూషణరావు సాధారణ రైల్వే ఉద్యోగి. ఇటీవల ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. అయితే, ఇసుక లేని కారణంగా సగంలో ఆపివేశాడు. ఉచిత ఇసుక అన్నారు.. కనీసం డబ్బులకైనా సకాలంలో ఇప్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

- మాటలకే పరిమితమైన ఉచిత ఇసుక
- రీచ్‌లు ఉన్నచోటే అందుతున్నవైనం
- మిగిలిన చోట్ల గగనం
- లబోదిబోమంటున్న భవన నిర్మాణదారులు

లారీ ఇసుక రూ. 50 వేలు

పలాస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)

పలాస నియోజకవర్గంలో భవన నిర్మాణదారులందరిదీ ఇదే పరిస్థితి. మూడు నెలల కిందటి వరకూ లారీ ఇసుక రూ.24 వేల నుంచి రూ.28వేలకు లభించేది. ప్రస్తుతం ఆ ధర రూ.50వేలకు పైమాటే. అది కూడా దొంగతనంగా దాచి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామని, కేవలం రవాణా చార్జీలు పెట్టుకుంటే సరిపోతుందని నేతలు హామీలు ఇచ్చారు. కానీ, ప్రస్తుత పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. నదులు, రీచ్‌లు ఉన్న నియోజకవర్గాల్లో ఇసుక ఉచితంగా దొరుకుతుందేమోగానీ, మిగిలిన ప్రాంతాల్లో మాత్రం గగనమైపోయింది. ఇసుక లభ్యత లేకపోవడంతో వందల కొద్ది భవన నిర్మాణాలు ఆగిపోయాయి. కొందరు అధిక ధరలకు కొనుగోలు చేసుకొని నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు.

ఇసుక కొరత..

పలాస నియోజకవర్గంలో ఇసుక కొరత అధికంగా ఉంది. ఈ నియోజకవర్గానికి ప్రతీ రోజు వెయ్యి టన్నుల వరకూ ఇసుక అవసరం ఉంటుంది. కానీ, ప్రస్తుతం 120 టన్నులు కూడా అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక డిమాండ్‌ను బట్టి పలాసలో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టన్ను ఇసుక రూ.940కే అమ్మడంతో కొంత ఊరట లభించేది. అయితే, దానికి చెందిన కాంట్రాక్ట్ రద్దవడంతో రీచ్‌ను మూసివేశారు. దీంతో ఇసుక కష్టాలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక మంత్రాన్ని జపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే కొద్ది రోజుల వరకే ఉచిత ఇసుక అందింది. అది కూడా ఇసుక రీచ్ ఉన్న టెక్కలి నియోజవర్గానికే పరిమితమైంది. ప్రస్తుతం టెక్కలి రీచ్ కూడా తాత్కాలికంగా మూతపడడంతో పలాసకు పూర్తిగా ఇసుక దిగుమతి కావడం లేదు. ఒడిశాలోని కాశీనగర్, గుణుపూర్, కటక్, ఛత్రపురం వంటి ప్రాంతాల నుంచి అతికష్టంపై ఇసుకను తీసుకువస్తున్నారు. ఒడిసా, ఆంధ్ర పన్నుల మినహా లారీ ఇసుక రూ.50వేలకు పైబడి పలుకుతుంది. దీంతో రవాణాదారులు, నిర్మాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఉచితంగా అందించకపోయినా, సరసమైన ధరలకు రీచ్‌ల ద్వారా ఇసుక పంపిణీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



నేటి నుంచి కొత్త మద్యం దుకాణాలు

- డిమాండ్ ఉన్న షాపులు 'గుడ్‌విల్'కు విక్రయాలు
- ఇచ్ఛాపురం, పాతపట్నంలో కనిష్టంగా రూ.25 లక్షలు
- ఇతరత్రా ప్రాంతాల్లో రూ. 40 లక్షలు

శ్రీకాకుళం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన పాలసీలో భాగంగా జిల్లాలో బుధవారం నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 158 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. బుధవారం నుంచి 2026 సెప్టెంబరు 30 వరకు రెండేళ్ల పాటు వీటిని నిర్వహించనున్నారు. దీంతో దశలవారీగా 'జే' బ్రాండ్ల మద్యం పూర్తిగా దూరం కానుంది. మందుబాబులు కోరుకునే మద్యం అన్ని దుకాణాల్లో లభించనుంది.

'గుడ్‌విల్' పేరిట బేరసారాలు..

జిల్లాలో ఏర్పాటు చేసే 158 మద్యం దుకాణాలకు గాను మన జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రం ఒడిశా నుంచి కూడా దరఖాస్తులు అందాయి. మొత్తం 4,671 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఎక్కువ మంది బృందంగా ఏర్పడి దరఖాస్తులు చేసుకున్నారు. నలభై, వంద, 150 షాపుల కోసం డబ్బులు వాటాలు వేసుకుని ఒక్కొక్కరి పేరుతో దరఖాస్తులు పెట్టుకున్నారు. షాపులు మాత్రం 158 మాత్రమే కావడంతో లాటరీ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసేశారు. ఆ తర్వాత నుంచి అసలు కథ ప్రారంభమయ్యింది. కొన్నిచోట్ల దరఖాస్తులు కొద్దిమొత్తంలో వేసినవారు, ఒక్కో దరఖాస్తు (మిగతా 6వ పేజీలో)



6

ఇక అన్నీ 'అపార్'లోనే..!



నీటి తీరువా లక్ష్యాన్ని చేరుకోవాలి: కలెక్టర్ 6

చిరిగిన సీట్లు.. అరిగిన టైర్లు

- తరచూ మరమ్మతులు
- ఇదీ జిల్లాలోని 108 వాహనాల పరిస్థితి
- నిర్వహణను గాలికొదిలేసిన గత వైసీపీ సర్కారు



కొల్లివలస వద్ద మొరాయించిన 108 వాహనం (ఫైల్)

మెళియాపుట్టి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తిరుగుతున్న 108 వాహనాల్లో చాలా వరకూ డొక్కువే. చిరిగిన సీట్లు, అరిగిన టైర్లతో నెట్టుకొస్తున్నాయి. ఎప్పుడు ఆగిపోతాయో, ఎప్పుడు కదులుతాయో తెలియదు. నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు వీటి నిర్వహణను గాలికొదిలేసింది. పాత వాహనాలకే రంగులు వేసి కొత్తవి మాదిరిగా కలరింగ్ ఇచ్చింది. దీంతో అత్యవసర వేళ రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 108 అంబులెన్స్ వాహనాలు 31 ఉన్నాయి. ఇందులో 11 వాహనాలు 2007 నాటివి. 20 వాహనాలే కొత్తవి. ఈ వాహనాలను జాతీయ రహదారి-16లోని పలు ప్రాంతాల్లో ఉంచుతున్నారు. పాత వాహనాలను మాత్రం గిరిజన, ఇతర ప్రాంతాలకు కేటాయించారు. మెళియాపుట్టి, చాపర ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒకే వాహనం ఉంది. ఈ ఆరోగ్యం కేంద్రం పరిధిలోని పలాస- పర్లాఖిమిండి రోడ్డులో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే, క్షతగాత్రులను సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించే సమయంలో కొన్నిసార్లు 108 వాహనం మరమ్మతులకు గురవుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తిని 108 వాహనంలో మెళియాపుట్టి నుంచి టెక్కలి ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా కొల్లివలస సమీపంలో ఆగిపోయింది. ఇంజిన్‌లో సమస్య ఏర్పడడంతో వాహనం ముందుకు కదల్లేదు. దీంతో రోగిని ఆటోలో ఆస్పత్రికి తరలించారు. అదే రాత్రి సమయంలో, అత్యవసర కేసు అయితే పరిస్థితి ఏమిటని రోగి బంధువులు ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో చాలాచోట్ల ఉంది. ముఖ్యంగా వాహనాల ఇంజిన్లు మరమ్మతులకు గురవుతుండడంతో బాగు చేసేందుకు పైలెట్లు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఈ వాహనాలను నిర్లక్ష్యం చేయడంతోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి జిల్లాకు కొత్త 108 అంబులెన్స్ వాహనాలను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా 'కొండపల్లి'

- మన్యం, కోనసీమ జిల్లాలకు అచ్చెన్న



శ్రీకాకుళం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికారిత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీచేసింది. ఇకపై శ్రీకాకుళం జిల్లాలో జరిగే అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాల అమలును ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్ పరిశీలించనున్నారు. సమావేశాలను కూడా ఆయన సమక్షంలో అధికార యంత్రాంగం నిర్వహించనుంది. జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును పార్వతీపురం మన్యం జిల్లా, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా శాఖ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులను విడుదల చేశారు.

జీవితంతో సెల్‌గాటం 6



ఎంత పని చేశావ్ తల్లీ?

- భర్త సరిగా చూడడం లేదని పిల్లలకు కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి ఇచ్చిన మహిళ
- తాను కూడా తాగి ఆత్మహత్యాయత్నం
- ఇద్దరు చిన్నారులు మృతి.. ప్రాణాలతో బయటపడిన తల్లి
- కుముందానివానిపేటలో విషాదం



రుషి, బాలాజీ (ఫైల్)



చికిత్స పొందుతున్న దుర్గ

సంతబొమ్మాళి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నవ మాసాలు మోసి, కని పెద్ద చేసిన ఆ తల్లి తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపేసింది. భర్త సరిగా చూడడం లేదని కుమారులకు కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి ఇచ్చి తాను కూడా తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ కూల్‌డ్రింక్ తాగిన పిల్లలు మృతి చెందగా, ఆమె ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటన సంతబొమ్మాళి మండలం మలగాం పంచాయతీ కుముందానివానిపేటలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కుముందానివానిపేటకు చెందిన గొర్లంగి దుర్గకు అదే గ్రామానికి డెక్కల రాజుతో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి రుషి(10), బాలాజీ (8) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిద్దరూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నారు. తండ్రి రాజు శ్రీకాకుళంలోని ఒక హోటల్‌లో కుక్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం గ్రామంలో దసరా పత్తిరి వారాలు కావడంతో తమ ఇంటికి విందుకు రావాలని దుర్గ తమ్ముడు గొర్లంగి హరి సోమవారం రాత్రి పిలుపు చేశాడు. అయితే, వంట చేయడం అయిపోయిందని, ఈ రాత్రికి భోజనాలు చేసి రేపు ఉదయం వస్తానని తమ్ముడితో దుర్గ చెప్పింది. దీంతో హరి వెళ్లిపోయాడు. ఉదయం తన అక్క వస్తానని చెప్పి ఇంకా రాకపోవడంతో హరి ఆమె ఇంటికి వెళ్లాడు. ఇంటి తలుపులు వేసి ఉండడంతో పక్కింటి వారికి అక్క గురించి అడిగాడు. పక్కింటి వారు తలుపులు గట్టిగా కొట్టడంతో దుర్గ తలుపులు తీసింది. లోపలకు వెళ్లి చూడగా ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా పడిఉన్నారు. కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి పిల్లలకు ఇవ్వడంతో వారు చనిపోయారు. ఆ డ్రింక్ తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన దుర్గ మాత్రం ప్రాణాలతో బయటపడింది. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం చిన్నారుల మృతదేహాలను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. దుర్గను చికిత్స కోసం 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తన భర్త సరిగ్గా చూడకపోవడం వల్లే ఈ అఘాత్యానికి వడిగట్టానని దుర్గ పోలీసులకు తెలిపింది. కళ్లముందే నిత్యం ఆడుతూపాడుతూ తిరిగే చిన్నారులు రుషి, బాలాజీ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మంగళవారం దసరా పత్తిరి వారాలు కావడంతో ఎంతో సందడిగా ఉండవలసిన గ్రామంలో విషాదం నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటన స్థలం వద్ద గుమిగూడిన గ్రామస్థులు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వేధింపులు భరించలేక ఈ పనిచేశా..

టెక్కలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన దుర్గకు టెక్కలి ఆస్పత్రిలో వైద్యులు ప్రాథమిక చికిత్స అందజేశారు. కొంతసేపటి తరువాత కోలుకున్న ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'నా భర్త రాజు శ్రీకాకుళం సమీపంలోని ఓ హోటల్‌లో కుక్‌గా పనిచేస్తున్నాడు. ఇంటికి వచ్చిన ప్రతీసారి మద్యంకు డబ్బులు కావాలని, తిరిగి వెళ్లేందుకు చార్జీలకు కూడా డబ్బులు కావాలని వేధించేవాడు. తరచూ నాతో గొడవ పడేవాడు. ఈ బాధను భరించలేకే నేను, పిల్లలు కూల్‌డ్రింక్‌లో ఎలుకలమందు కలిపి తాగామని' తెలిపింది.

● రణస్థలం మండల కేంద్రంలో సంతోష్ అనే ఎనిమిదేళ్ల బాలుడు విపరీతంగా సెల్‌ఫోన్ చూస్తుంటాడు. ఇటీవల అనారోగ్యం బారిన పడ్డాడు. తలబాధతో సతమతమతమవుతున్నాడు. తల్లిదండ్రులు వెంటనే వైద్యులకు చూపించగా సెల్‌ఫోన్ ప్రభావంతోనేనని తేల్చారు. దీంతో క్రమేపీ బాలుడికి సెల్‌ఫోన్ దూరం చేస్తున్నారు.

● పైడిభీమవరం గ్రామానికి చెందిన ఓ చిన్నారి ఉదయం లేచింది మొదలు సెల్‌ఫోన్ చూడడం అలవాటు. రాత్రిపూట తల్లిదండ్రులు పడుకున్న సమయంలో కూడా సెల్‌ఫోన్ తీసుకొని చూస్తుంటాడు. అయితే ఇటీవల బాలుడికి ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. విపరీతమైన తలనొప్పితో బాధపడుతున్న బాలుడు నీరసించిపోయాడు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రిలో చేర్పించగా సెల్‌ఫోన్ చూడడమే కారణమని తేల్చారు. చివరకు బాలుడికి కళ్లద్దాలు ధరించవలసి వచ్చింది.

● ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని తరచూ సెల్‌ఫోన్ చూస్తోంది. చాటింగ్ చేస్తోంది. గమనించిన తల్లి ఎందుకు అలా చేస్తున్నావు అని అడిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆ బాలిక ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. సకాలంలో చుట్టుపక్కల ఉన్న వారు స్పందించడంతో ప్రమాదం తప్పింది.

● ఓ భవన నిర్మాణ కార్మికుడు కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. సెల్‌ఫోన్ కావాలని మారం చేయడంతో రూ.10 వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. పిల్లాడిపై ప్రేమతో అలా చేశారు. కానీ అక్కడకు కొద్దిరోజులకే రూ.30 వేలు విలువ చేసే ఐ ఫోన్ కావాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు.ఒక్కగానొక్క కుమారుడు కావడంతో తల్లిదండ్రులు అప్పు చేసి మరి కొనుగోలు చేసి ఇచ్చారు.



జీవితంతో సెల్‌గాటం

● వ్యసనంలా మారుతున్న సెల్ వినియోగం ● చిన్నారుల్లో అధిక ప్రభావం
● రోజులో సగం కాలం వాటితోనే ● పక్కదారి పడుతున్న యువత
● తల్లిదండ్రులు జాగ్రత్తగా లేకపోతే ముప్పే



రణస్థలం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):

అన్నం తినకుండా మారం చేస్తున్నారనో.. అల్లరి ఆపడం కోసం చాలా మంది తల్లిదండ్రులు పిల్లల చేతికి సెల్‌ఫోన్ ఇస్తుంటారు. ప్రారంభంలో ఇది సరదాగా అనిపించినా.. క్రమేపీ అదొక వ్యసనంలా మారిపోతోంది. దీంతో రోజులో ఎక్కువ సమయం వారు సెల్‌ఫోన్‌తో గడుపుతున్నారు. పిల్లల రోజువారి సెల్‌ఫోన్ వినియోగంపై హ్యాపీనెడ్జ్ అనే సంస్థ సర్వే చేపట్టింది. ఈ సర్వే నివేదిక ప్రకారం 42 శాతం మంది 12 సంవత్సరాల్లోపు పిల్లలు రోజుకు 2 గంటల నుంచి 4 గంటల వరకూ ఫోన్ స్క్రీన్లకు అతుక్కుపోతున్నారు. 12 ఏళ్ల కంటే పైబడిన పిల్లలు రోజులో 47 శాతంపైబడి సెల్ ఫోన్లు చూస్తున్నారని తేలింది. ఈ సర్వే ప్రకారం 69 శాతం పిల్లలకు సొంతంగా సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్లు ఉన్నాయని తేలింది. 12 ఏళ్ల కంటే పైబడిన వయసున్న పిల్లలు ఎలాంటి షరుతులు లేకుండా ఇంటర్నెట్ యాక్సెస్ పొందుతున్నారని తేలింది. 74 శాతం మంది పిల్లలు కేవలం యూట్యూబ్ చూసేందుకే ఫోన్ వాడుతుంటే.. మరికొందరు గేమింగ్ కోసం ఎక్కువగా సెల్‌ఫోన్ వినియోగిస్తున్నట్లు తేలింది. ఇతర విషయాల్లో తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణలో పెడతున్నా.. విద్యావసరాల పేరిట మాత్రం సెల్‌ఫోన్ వినియోగాన్ని మాత్రం కంట్రోల్ చేయలేకపోతున్నారని నిర్ధారణ అయ్యింది.


జీవితంలో సెల్‌ఫోన్ భాగం..

మనిషి నిత్య జీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగమైంది. కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి సెల్‌ఫోన్లు ఉన్నాయి. సగటు ఒక కుటుంబం సెల్‌ఫోన్ ఖర్చు నెలకు కచ్చితంగా రూ.700. అది కూడా భార్యాభర్తలు ఉన్న కుటుంబంలో. పిల్లలు వినియోగిస్తే దానికి మరో రూ.300 అదనం. ఇక అపరిమిత డేటాను కూడా వినియోగించి రోజులో ఇంటర్ నెట్ బ్యాలెన్స్ వేసిన వారు ఉంటారు. అయితే ఇంతలా సెల్‌ఫోన్ వినియోగం పెరిగినా ప్రయోజనం ఉందా? అంటే సమాధానం దొరకని పరిస్థితి. సెల్‌ఫోన్ వినియోగంతో లాభాలు ఎంత ఉన్నాయో? అంతకు మించి దుష్పరిణామాలు ఉన్నాయి. పిల్లల చదువుల కోసమని తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు కొనుగోలుచేసి ఇస్తుంటారు. కానీ వారు అశ్లీల నీలిచిత్రాలు, యూట్యూబ్ చూసేందుకే ఎక్కువ వినియోగిస్తున్నారు. దీనికితోడు కొందరు పక్కదారి పడుతున్నారు. పబ్జీ, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడుతున్న వారు ఉన్నారు. కొంతమంది యువత గ్రూపులుగా ఏర్పడి ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారు. మరికొందరు అయితే ఆన్‌లైన్ జూదాలకు అలవాటు పడి అప్పలపాలవుతున్నారు. కొందరు వేదింపులకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఎన్నో అనర్థాలు..

ఎన్నోరకాల అనర్థాలకు సెల్‌ఫోన్లు కారణమవుతున్నాయి. పిల్లలు సరదా పడుతున్నారని... వారి అల్లరి నుంచి తప్పించేందుకు ఫోన్లు ఇస్తుంటారు. అక్కడే తప్పుప్రారంభమవుతుంది. ఆ తప్పే అనర్థాలకు దారితీస్తోంది. పిల్లలకు నేర్చుకోవాలన్న ధ్యాస తగ్గుతుంది. చివరకు గుణింతాలు, అంకెలు, జవాబుల కోసం సెల్‌ఫోన్లనే వాడుతున్నారు. టీనేజ్‌ల సెల్‌ఫోన్ల వినియోగం కూడా ఎన్నో దుష్పరిణామాలకు దారితీస్తోంది. చిన్నారుల్లో అయితే మానసిక వ్యాధులు, వ్యసనానికి కారణమవుతోంది. కళ్లల పై తీవ్ర ప్రభావం పడుతోంది. అందుకే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

-సనపల నరసింహమూర్తి,
వైద్య నిపుణుడు, శ్రీకాకుళం



ఇవి చేస్తే మంచిది..

ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలి. ఒక వేళ విద్య, ఇతర అవసరాలకు ఇచ్చినా వారిపై ఒక కన్నేసి ఉంచాలి. వ్యసనంగా మార్చే గేమ్‌లు ఉంటాయి. అశ్లీలత దృశ్యాలు, నీలి చిత్రాలకు కనెక్టు అయిన వారు ఉంటారు. ముఖ్యంగా ఆడపిల్లల తల్లిదండ్రులు ఈ విషయంలో చాలారకాలుగా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు మానసిక రోగులుగా మారితే వారి భవిత దెబ్బతింటుంది. ఆ ప్రభావం కుటుంబంపై పడుతుంది. తల్లిదండ్రులు ఎక్కువ సమయం పిల్లలతో గడపాలి. అలా గడుపుతున్నామన్న విషయం పిల్లలకే తెలియకూడదు. వారి మనసు ఇతర వ్యసనాలపై మళ్లకుండా అది చాలా దోహదపడుతుంది. వీకెండ్‌లో మంచి ప్రదేశానికి తీసుకెళ్లాలి. పరిసరాలను, సమాజాన్ని వారికి పరిచయం చేయాలి. సమగ్ర అవగాహన వచ్చేలా, అర్థమయ్యేలా చేయాలి. తల్లిదండ్రులు వీలైనంత వరకూ పిల్లల ముందు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలి. పిల్లలు పడుకున్న తరువాత వాడుకోవడం చాలా ఉత్తమం. ఉమ్మడి కుటుంబాలు, బంధువులు, పూర్వీకులు, రక్తసంబంధీకుల గురించి చెప్పాలి. మానవ సంబంధాలతో మానవీయ విలువలను తెలియజెప్పాలి. తెలుగు పద్యాలు, పాటలు, సంగీతం, వ్యాసరచన, పెయింటింగ్ వంటి వాటిపై ఆసక్తి పెంచాలి. ముఖ్యంగా వారు నేర్చుకోవాలి అన్న ధ్యాస పెంచితే మిగతా అనవసర విషయా లపై దృష్టి తగ్గుతుంది. ఇంటి పరిసరాల్లో ఖాళీ ప్రదేశాల్లో మిద్దె కూరగాయలు పెంచాలి. అప్పుడే ఖాళీ సమయాల్లో పిల్లలు అక్కడ పనిచేసే అలవాటు చేయాలి.

నేటి నుంచి కొత్త మద్యం దుకాణాలు

(5వ పేజీ తరువాయి)

చేసినవారు, షాపు దక్కితే తర్వాత చూద్దామన్నవారు ఇప్పుడు బయటపడ్డారు. గ్రూపుల్లో ఒకరి పేరుతో షాపులు దక్కగా 'గుడ్‌విల్' పేరిట రెండేళ్లకు షాపును విక్రయించేందుకు బేరసారాలు ఆరంభమయ్యాయి. పాతపట్నం, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో గుడ్‌విల్ ధర షాప్‌నకు రూ. 25లక్షలుగా నిర్ణయించారు. గుడ్‌విల్‌కు షాపులు విక్రయించేయాలని.. లేకుంటే.. భవిష్యత్తులో ఇబ్బం దులు తప్పవని సామ బేధ దండోపాయాలను ప్రయోగించేందుకు బడాబాబులు సిద్ధమయ్యారు. సోంపేటలో ఓ దుకాణానికి రూ. 40 లక్షలకు గుడ్‌విల్ ధర ఆరంభమై రూ. 25 లక్షలకు ఖరారైంది.

ఆ ఆరు నియోజకవర్గాల్లో ఫుల్ డిమాండ్

శ్రీకాకుళం, పలాస, ఎచ్చెర్ల, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లో వైన్ షాపులకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ అందరూ సిండికేట్‌గా దరఖాస్తులు వేశారు. ఇప్పుడు దక్కిన షాపులకు గాను సిండికేట్‌గా వ్యాపారం చేయడం కంటేనూ... సింగిల్‌గా వ్యాపారం చేసేందుకు ఆసక్తి చూపిస్తూ.. షాపులను గుడ్‌విల్ పేరిట కొనుగోలు చేసేందుకు పెద్దఎత్తున బేరసారాలు జరుగుతున్నాయి. ప్రతి షాపు రెండేళ్లకు రూ.40 లక్షలు గుడ్ విల్ ధర నిర్ణయించేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్ 20 శాతం కాగా.. ఇతరత్రా కలిపి మొత్తం 30 శాతం లాభాలు వచ్చే అవకాశముందని.. అందుకే ఎన్ని లక్షలు వెచ్చించినాసరే సొంతంగా వైన్ షాపు నిర్వహించుకుంటే లాభపడేది తామే అంటూ భావించి బేరసారాలు జరుపుతున్నారు. యాభై శాతం షాపులన్నీ గుడ్‌విల్‌కు విక్రయాలు జరిగిపోయాయి. వీటికి ఎటువంటి రాత కోతలు ఉండవు. నోటిమాట ఆధారంగా పెద్దమనుషుల మధ్య డబ్బులు ఇచ్చేయడమే. మిగిలిన యాభై శాతం షాపులన్నీ టీడీపీ, వైసీపీకి చెందిన అనుచరులు సిండికేట్ సభ్యుల చేతిలోనే నిర్వహణ జరగనుంది. మొన్నటివరకు ఎన్నికల్లో బాహాబాహీకి దిగినవారందరూ ఇప్పుడు మద్యం వ్యాపారం కోసం ఏకమయ్యారు.

మళ్లీ మామ్మూళ్లు..

మద్యం షాపు నిర్వహించాలంటే అంత సులభం కాదు. తరుచూ ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేస్తూ ఉంటారు. అలానే షాపు వద్ద గొడవలు జరిగితే పోలీసులు వెళ్తుంటారు. తొలి రెండు నెలలు ఎటువంటి అక్రమాలు జరగకుండా దుకాణాల్లో మద్యం విక్రయాలు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తారు. ఆ తర్వాతనే అసలు రంగు బయటపడుతుంది. షాపు పరిధిలో బెల్ట్ షాపులకు కళ్లెం విప్పుతారు. అలానే షాపు పరిధిలో ఉన్న మండలం, నియోజకవర్గం ఆధారంగా ప్రజాప్రతినిధికి లాభంలో కొంతమామ్మూళ్లు ఇవ్వాల్సిందే. లాభంలో 20 నుంచి 40 శాతంగా నిర్ణయిస్తారని ప్రచారం జరుగుతోంది. అలానే ఎక్సైజ్ సిబ్బందికి, పోలీసులకు మామ్మూళ్లు ఇవ్వాల్సిఉంటుంది. గత ఐదేళ్లు వీరికి ఎటువంటి లాభం లేదు. ఇప్పుడు షాపుల వారీగా కచ్చితంగా మామ్మూళ్లు అందుతాయి. దీంతో ఇన్నాళ్లికి మరలా మంచిరోజులు వచ్చాయంటూ బయటకు చెప్పలేనంత సంతోషంగా ఉన్నారు.

నిబంధనలు పాటించేనా?

వాస్తవంగా దుకాణంలో మద్యంను పూర్తి సీసాలుగా విక్రయించాలి. అక్కడ ఇతరత్రా విక్రయాలు జరగకూడదు. అటువంటివి చేయాలంటే కేవలం బార్‌లకు మాత్రమే అనుమతి ఉంటుంది. అయితే, ప్రస్తుతం చాలామంది మద్యం ఎమ్మార్పీ ధరలను పెంచేసి రెండుచేతులా సంపాదించుకుందామన్న ఉత్సుకతతో ఈ వ్యాపారంలోకి దిగారు. అయితే, ఎమ్మార్పీ ధరలు పెంచినా, నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని ఇప్పటికే ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మద్యం వ్యాపారులు నిబంధనలు పాటిస్తారా, లేదా అనేది త్వరలో తేలిపోనుంది.

నీటి తీరువా లక్ష్యాన్ని చేరుకోవాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నందున, నీటి తీరువా లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయడంతో పాటు పనిదినాలు జనరేట్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌జీఈఎస్ ఏపీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల ద్వారా గ్రామస్థాయిలో చేపట్టిన పనులను వంద శాతం పూర్తి చేయాలి. స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలి. ప్రతీ పంచాయతీలో చేసిన అభివృద్ధి పనుల వివరాలకు సంబంధించి ఆయా గ్రామాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలి. హౌసింగ్ పనులకు సంబంధించి ఇసుక, సిమెంట్, ఇతర మెటీరియల్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. జిల్లాలోని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గ్రామాల్లో మంచినీటి ట్యాంకులకు క్లోరినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల మరమ్మతు పనులు పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి. రానున్న మూడు సంవత్సరాల్లో నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి' అని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో అప్పారావు, వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి, డీపీవో కె.భారతి సౌజన్య, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇక అన్నీ 'అపార్'లోనే..!

● విద్యార్థులకు శాశ్వత గుర్తింపు ప్రత్యేక నెంబరు
● విద్య, అడ్మిషన్లు, ఉపకారవేతనాలు అన్నీ ఇందులోనే..
● కేంద్రం కసరత్తు.. కార్యాచరణ చేపట్టిన అధికారులు



నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు



నరసన్నపేట/హిరమండలం అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు శాశ్వత గుర్తింపు ప్రాతిపదికన ప్రత్యేక నెంబరును కేటాయించే ప్రక్రియను కేంద్రం అమలు చేయినుంది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఆధార్ తరహాలో వన్ నేషన్.. వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేజీ నుంచి పీజీ వరకు ఈ ప్రత్యేక నెంబరు (గుర్తింపు సంఖ్య)ను ఇవ్వనుంది. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలు యాజమాన్యాలు కార్యాచరణ చేపట్టాయి. జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. వీటిలో 6,372 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం, 5,444 మంది ద్వితీయ సంవత్సరం చదువుచున్నారు. ఇంటర్ ప్రైవేటు కళాశాలల్లో మరో 23,498 మంది చదువుచున్నారు. జిల్లాలో 1,915 ప్రాథమిక పాఠశాలలో 45,018 విద్యార్థులు, 315 యూపీ పాఠశాలల్లో 22,569 మంది, 419 ఉన్నత పాఠశాలల్లో 79,497 మంది 1.79లక్షల మంది చదువుచున్నారు. పాఠశాల విద్యలో తొమ్మిదోతరగతి, పదోతరగతి విద్యార్థులకు మాత్రమే అపార్ కార్డులను జారీ చేయనున్నారు. వీరు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 38 వేల మంది ఉన్నట్లు యూడైస్ ఆధారంగా అధికారులు చెబుతున్నారు.

మొదటి విడతలో ఇలా..

ఆధార్ తరహాలో గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు 9 నుంచి ఇంటర్ వరకు విద్యార్థుల వివరాలను యూ డైస్ ప్లస్‌లో ఆప్‌లోడ్ చేస్తారు. విద్యార్థుల జన్మించిన తేదీ, లింగం, క్యూఆర్ కోడ్, ఫొటో, 12 అంకెల ప్రత్యేక నెంబరు, మార్కులు, గ్రేడు, ఉపకారవేతనం, వ్యక్తిగత, విద్యాసంబంధిత వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు తదితర వివరాలతో డిజిటల్ కార్డులో భద్రంగా ఉంటాయి. ఈ కార్డును స్కాన్ చేస్తే మొత్తం వివరాలు వెంటనే తెలుసుకునే సదుపాయం కలుగుతుంది.

బ్యాంకు ఖాతా, డిజీ లాకర్‌తో అనుసంధానం..

అపార్ కార్డు విద్యార్థి బ్యాంకు ఖాతా, డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. డీజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో అపార్ కార్డు వస్తుంది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తద్వారా వివిధ విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ తదితరాలు అన్నీ సులభంగా పూర్తి చేసేందుకు వీలుంది. ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ వంటి సందర్భాల్లో కూడా ఈ కార్డు కీలకం కానుంది. విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి విద్యాసంస్థలలో ఆధార్ కార్డులోని వివరాలను నమోదు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న యూ డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ఇప్పటికే ప్రతి విద్యార్థికి పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబరు) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం, టీసీలు జారీ చేయడం తదితర కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇకపై అపార్‌తోనే అన్నీ నిర్వహించనున్నారు.

విద్యార్థులకు చాలా ఉపయోగం

విద్యార్థుల వివరాలన్నీ ఒకే ఐడీలో నమోదవుతాయి. ప్రతి విద్యార్థి అపార్ కార్డు కోసం నమోదు చేసుకోవాలి. కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి గుర్తింపు నెంబరు ఇస్తారు. ఒక్కసారి అపార్ నెంబరు పొందితే అందులో అన్ని వివరాలు ఉంటాయి. నకిలీ సర్టిఫికెట్లకు అవకాశం ఉండదు. ఇప్పటికే ప్రిన్సిపాల్స్‌కు విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

-పి.దుర్గారావు, ఆర్‌ఐవో, ఇంటర్ విద్య

అంబరాన్ని తాకిన సిరిమాను సంబరం

విజయనగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విజయనగ రం ఇలవేల్పు, చల్లని చూపుల తల్లి పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవం అంబరాన్ని తాకింది. అశేష జనవాహిని పైడిమాంబ నామస్మరణ మధ్య మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు చదురుగుడి వద్ద సిరిమాను కదిలింది. మూడు లాంతర్లు నుంచి అంబటి సత్రం జంక్షన్, మూడు లాంతర్లు నుంచి గంటస్తంభం, మూడు లాంతర్లు నుంచి కోట జంక్షన్ భక్తజనసంద్రమైంది. మధ్యాహ్నం 3.30 గంటలకు అమ్మవారి పరివారం పాలధార, బెస్తావారి వల, అంజలి రథం ముందుకు కదలగా సిరిమాను అదే దారిలో నడిచింది. సిరిమానును అధిరోహించిన బంటుపల్లి వెంకటరావు అమ్మవారి ప్రతిరూపంగా భక్తజనాన్ని ఆశీర్వదించారు. ఆ సమయంలో జై పైడిమాంబ అంటూ భక్తులు అరటిపండ్లను విసిరారు. దాదాపు రెండు గంటల పాటు సిరిమాను మూడు పర్యాయాలు కోట శక్తికి నమస్కరించి తిరిగి వచ్చింది. 5.20 గంటలకు సిరిమాను ఊరేగింపు ముగిసింది. కోట బురుజుపైనుంచి పూసపాటి వంశీయులైన అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సంబరాన్ని వీక్షించారు.



సిరిమానోత్సవం జరుగుతున్న దృశ్యం

రేషన్ సరకుల కోసం గిరిజనుల ఎదురుచూపు

సరుబుజ్జిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బక్కిరిపేటలో 13 గిరిజన కుటుంబాలు రేషన్‌సరుకుల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ నెలకు బియ్యం ఇవ్వడం జరగదని అధికారులు చెబుతున్నారని గిరిజనులు వాపోతున్నారు. ఈమేరకు మంగళవారం తహాశీల్దార్ కార్యాలయానికి లబ్ధిదారులు సివిల్ సప్లై డీటీని కలవడానికి వచ్చారు. సరుకులు రావు, తర్వాత చూద్దామని సమాధానం చెబుతున్నారని వారు వాపోయారు. అధికారులు బియ్యం అందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



రేషన్ అందలేదని చెబుతున్న గ్రామస్థులు

ఉపాధ్యాయుల సమస్యలపై రేపు యూటీఎఫ్ ధర్నా

గుజరాతీపేట, అక్టోబరు 15: మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలపై డీఈవో కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. 2022 జూన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి తీసుకువచ్చారని తెలిపారు. తద్వారా జడ్పీ ఉపాధ్యాయులకు ఉన్న అన్ని రకాల జీవోలు అమలవుతాయని భావించామన్నారు. కానీ, డీడీవో పవర్ తప్ప మిగిలిన సమస్యలు అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, అప్ గ్రేడేషన్, ప్రమోషన్లు, బదిలీలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహనరావు, ఎస్.కిషోర్‌కుమార్, ఎల్.బాబూరావు, బి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: గాంధీ మందిరంలో అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న మందిర కమిటీ ప్రతినిధులు



సోంపేట: జూనియర్ కళాశాలలో కలాం జయంతి నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



పొందూరు: తాడివలసలో కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం కంఠయ్య



నరసన్నపేట:డిగ్రీ కళాశాలలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

● జిల్లా వ్యాప్తంగా జయంతి పురస్కరించుకుని ఘన నివాళి

మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాం జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని వక్తలు తెలిపారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన దేశానికిచేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)



టెక్కలి: శాఖాగ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



పలాస రూరల్: బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్‌లో..



హిరమండలం: అవలంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

అన్న క్యాంటీన్లు నిర్వీర్యం చేసిన జగన్

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వీర్యం చేశారనిఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆరోపించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయం ఎదురుగా గాంధీ పార్క్ పక్కన నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్న క్యాంట టీన్లు తెరిచి ప్రతి పేదవానికి కూడా రూ.5కే భోజనం అందజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు చంద్రబాబు త్వరగా వినియోగంలోకి తీసుకువచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి, జనసేన, బీజేపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు దాసరి రాజు, నిర్మలారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

సచివాలయ వ్యవస్థతో పాలన అస్తవ్యస్తం: కూన

పొందూరు,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో మహిళాపోలీసు ఉద్యోగానికి కనీసం జాబ్ చార్ట్ లేదని, వారికి ఎటువంటి చట్టబద్దత లేదని, వారికోసం అసెంబ్లీలో లేవనెత్తుతానని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థఅర్థంలేని వ్యవస్థఅని, దీంతోపాలన అస్తవ్యస్తమైందని తెలిపారు. మంగళవారం పొందూరులో సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. రెవెన్యూ ఫిర్యాదులను గ్రీవెన్స్ పోర్టల్‌లో నమోదుచేయడానికి వీఆర్వోలు చొరవ తీసుకోవాలన్నారు. రాపాక కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు, పొందూరుకు సంబంధించిన అన్ని రకాల ఆక్రమణలపైనా నివేదిక ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి వీఆర్వో, సర్వేయర్‌లను ఆదేశించారు.



మాట్లాడుతున్న రవికుమార్

ఎక్సైజ్ పాలసీలో పారదర్శకతకు పాతర: తమ్మినేని

ఆమదాలవలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పాలసీలో ప్రభుత్వం పారదర్శకతకు పాతరవేసిందని వైసీపీ పార్లమెంట్ పరిశీలకుడు తమ్మినేని సీతారాం ఆరోపించారు. మంగళవారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాలను పక్కనపెట్టి టెండర్లవిధానంలో దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం కూటమి ప్రభుత్వం దగాకోరు విధానాలకు నిదర్శనమన్నారు. మద్యం దుకాణాలను ఖరారుచేసేందుకు పది రోజుల విరామంలో లైసెన్స్‌లకు దరఖాస్తులు ఆహ్వానించడం, వెను వెంటనే ఖరారు చేయడం వెనుక అవినీతి చోటు చేసుకుందన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు



దూసి వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ఆమదాలవలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూసి వద్ద నాగావళి నది పరివాహక ప్రాంతంలో తిరుగుతున్న ట్రాక్టర్లను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. కొంతకాలం నుంచి నాగావళి నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు తమ సొంత స్థలాల నుంచి వెళ్లడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ సొంత స్థలంలో ట్రాక్టర్లురాకపోకలు సాగించకుండానదికి పోయే రహదారికి అడ్డంగా కర్రను ఏర్పాటు చేశారు. కొంతమంది రైతులు ఆ దారిలో నిల్చొని తమ సొంత స్థలాల్లో ఎటువంటి ట్రాక్టర్లు రాకపోకలు సాగించినా సహించేది లేదని ట్రాక్టర్ల యజమానులు, నిర్వాహకులకు స్పష్టంచేశారు.



జి.సిగడాం: చేతులు శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వెలుగు సిబ్బంది

కొరాఠిలో హ్యాండ్ వాషింగ్‌డే

ఇచ్ఛాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొరాఠిలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే పురస్కరించుకుని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేతులు శుభ్రపరచుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నాయకులు దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, కామేష్, నరేంద్ర పాల్గొన్నారు.

● జి.సిగడాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం ఎంఎంఎస్ కార్యాలయంలోవాషింగ్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి రామకృష్ణం నా యుడు, సీవో, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.



నేడు రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక

ఎచ్చెర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ క్రీడా మైదానంలో బుధవారం రిపబ్లిక్ పరేడ్ ప్రీఈవెంట్ కోసం ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేస్తామని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనూరాధ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల నుంచి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎంపికకు హాజరుకావాలని కోరారు. రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వలంటీర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్జపాడు, డొంకూరు, సన్యాసిపుట్టుగల్లో బుధవారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ యోగేశ్వరరావు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

గుజరాతీపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లను గురువారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఏ తెలుగులో 29, ఎంఎస్సీ జువాలజీలో 19, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 11, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో మూడు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునేవారు ఏపీ పీజీ సెట్-2024 క్వాలిఫై అయి ఉండాలని పేర్కొన్నారు.డిగ్రీ ప్రొవిజనల్, ఏపీపీజీ సెట్-2024 ర్యాంక్ కార్డు, కుల, రెసిడెన్సీస్టడీ సర్టిఫికెట్లు ఈడబ్ల్యూఎస్, టీసీతో అడ్మిషన్ కోసం రావాలని కోరారు.

గౌరమ్మ సంబరాలు ప్రారంభం

ఎచ్చెర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తపేట, ఫరీద్‌పేట, కేశవరావుపేట,బొంతలకోడూరుల్లో ఐదురోజుల పాటు నిర్వహించనున్న గౌరమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. పాడి పంటలు వృద్ధి చెందాలని గౌరమ్మను పూజిస్తారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కొనసాగుతోంది. మంగళవారం రెండు షిఫ్టుల్లో కలిపి శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 200కు 175 మంది హాజరయ్యారు. ఈనెల 3న ప్రారంభమైన ఈ పరీక్షలు 21వ తేదీతో ముగుస్తాయి.

మద్యం సేవించి ఇబ్బందిపెడితే శిక్ష

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు పెడితే 14 రోజుల జైలు శిక్ష తప్పదని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించే క్రమంలో ఇటీవల జరిగిన కొన్ని కేసుల ఆధారంగా మద్యం మత్తులో జరిగిన గొడవలు జిల్లాలో అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు.దీంతో ఇటువంటి కేసులను నియంత్రించే క్రమంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ సూచనల మేరకు బహిరంగంగా మద్యపానం చేసి గొడవలకు దిగే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.కాగాబహిరంగంగా మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ బలగ మురళీకృష్ణకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి 14రోజుల జైలు శిక్ష విధించారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

జి.సిగడాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి సాహూ, డీఏ పొగిరి రాము, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, గుణబాబు, మన్మథరావు, రాజశేఖర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వెయిట్ లిఫ్టర్లకు అభినందన

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ నైపుణ్యం ప్రదర్శించి పతకాలను కైవశం చేసుకున్న ఎం.తరుణ్, జి.వర్షితలకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ అభినందించారు. హిమచల్ ప్రదేశ్‌లో జరిగిన చాంపియన్‌షిప్‌లో జి.వర్షిత బంగారం, కాంస్య పతకం, ఎం.తరుణ్ రజిత పతకాన్ని కైవశం చేసుకోవడంతో సన్మానించారు.తర్ఫీదు నిచ్చిన శిక్షకుడు ఐ.అప్పన్న, సంఘం ప్రతినిధులు ఇంజిరాపు భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, జి.హిమగిరి అభినందించారు.

‘ఉల్లాస్’పై దృష్టి సారించండి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే నైట్ వాచ్‌మన్లను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. మంగళవారం వయోజన విద్యపై కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సాయంత్రం అంగన్‌వాడీ భవనాల్లో తరగతులు నిర్వహించాలని, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ నోడల్ అధికారిగా వ్యవహరించాలని తెలిపారు.మండలాల వారీగా అక్షరాస్యతా లక్ష్యాలను నిర్దేశించి, అంగన్‌వాడీ, సామాజిక భవనాలను అందుబాటులో ఉంచి శిక్షణను ఇవ్వాలని కోరారు. జిల్లా, మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వీఓఏలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ద్వారా వాలంటీర్ టీచర్లను, నేర్చుకునే వారిని గుర్తించాలని చెప్పారు. వాలంటీర్ టీచర్లు, ఉల్లాస్ యాప్ ద్వారా నేర్చుకునేవారి పేర్లను నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో వయోజన విద్య ఏడీ ముద్దాడ వెంకటరమణ, డీపీవో కె.భారతి సౌజన్య, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిఐపిఆర్ఓ కె.చెన్నకేశవరావు, ఏపీఓ బాలచందర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డిస్లెక్సియాపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లాలో ర్యాలీలు, అవగాహన సదస్సులు

జి.సిగడాం/సరుబుజ్జిలి/ఇచ్ఛాపురం/బూర్జ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డిస్లెక్సియాపై(పఠనంలో ఇబ్బంది) అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. మంగళవారం ప్రపంచ డిస్లెక్సియా దినోత్సవం పురస్కరించుకుని జి.సిగడాం ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రంలో, ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. సరుబుజ్జిలి మండలం రొట్టవలస జడ్పీ హైస్కూల్‌ప్లస్ పాఠశాల ఆవరణలో, బూర్జ మండలం రాజపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎర్ర మాలతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

తపాలా ఉద్యోగుల నిరసన

అరసవల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని తపాలా శాఖలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగ సంఘాల జాయింట్ కౌన్సిల్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ ఇచ్చిన పిలుపు మేరకు పోస్టల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. రద్దు చేసిన సంఘాల గుర్తింపును తక్షణమే పునరుద్ధరించాలని, తపాలా శాఖను ప్రైవేటీకరించే పనులను ఆపాలని, ఎనిమిదో వేతన కమిటీని నియమించాలని కోరారు. కార్యక్రమంలో గ్రూప్-సి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గణపతి, కామ్రేడ్ బాబూరావు, బెవర అప్పారావు, రమణ, వేంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, గురన్న, రామకోటి, అసిరయ్య పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

శివానీ ప్రిన్సిపాల్‌కు సీఎస్‌సీ అవార్డు

ఎచ్చెర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం) ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావుకు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సిస్ (సీఎస్‌సీ) ఎక్సలెన్స్ ఇన్ లీడర్ షిప్ అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవార్డును అందజేసింది. ఈనెల ఐదో తేదీన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని వర్చువల్ విధానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానంచేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడంలో చేసిన కృషికి గాను అవార్డును అందజేసినట్టు సీఎస్‌ఈ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సల్టెంట్ వై.రామ్మోహనరావు పేర్కొన్నారు.ఈ మేరకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అవార్డు రావడంపైశివానీ యాజమాన్య ప్రతినిధులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న దుర్గాప్రసాద్‌రాజు తదితరులు

చిరుధాన్యాలతో ఆహారపదార్థాల తయారీపై శిక్షణ

లావేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తాళ్లవలసలో నాబార్డు ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం అమరావతి ఆర్థిక సహకారంతో బెజ్జిపురం యూత్‌క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన 30 మంది మహిళలకు చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీలో ప్యాకింగ్, బ్రాండింగ్ , మార్కెటింగ్‌పై శిక్షణ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణ,కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సునీత, యూత్ క్లబ్ డైరెక్టర్ ప్రసాదరావు, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ మోహన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫైనాన్స్ లిటరసీ కౌన్సిలర్ సువ్వారి రవిబాబు తెలిపారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని నాలుగో వార్డు గేదెలవానిపేటలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్, రామారావు, ఆర్పీలు జయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

మద్యం సేవించి ఆటోలు నడపవద్దు: ఎస్ఐ

ఆమదాలవలస, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి డ్రైవర్లు ఆటోలు నడపరాదని కె. వెంకటేష్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు పోలీస్‌స్టేషన్ వద్ద నిబంధనలపై అవగాహన కల్పించారు.వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని తెలిపారు.

ప్రపంచ కళాజాతరకు రాములు ఎంపిక

ఆమదాలవలస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం డాక్టర్ కేవీ రాములు శ్రీ కళావేదిక ప్రపంచ కళాజాతరకు ఎంపికయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ కళాజారతకు ఆహ్వానం అందినట్లు రాములు తెలిపారు.

పారదర్శకంగా కూటమి పాలన

అరసవల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలన పారదర్శకంగా జరుగుతోందని శ్రీకాకుళం నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం జరిగిన మద్యం వేలంపాట రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత పారదర్శకంగా, నిజాయితీగా జరిగిందని, పాటలో వైసీపీ వారే ఎక్కువ మంది ఉండడమే అందుకు నిదర్శనమని తెలిపారు. కల్తీ మద్యంతో, భారీ ధరలతో రాష్ట్రాన్ని అనారోగ్యఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్ కోటరీదేనని విమర్శించారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

ఎచ్చెర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు సంబంధించి ఈ- క్రాప్ నమోదు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు ఏవో వై.సురేష్ తెలిపారు. తోటపాలెంలో మంగళవారం ఈ-క్రాప్ నమోదు వివరాలను ఆయన పరిశీలించారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వాతావరణం దృష్ట్యా వరి తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో విజయభాస్కర్ సూచించారు. మంగళవారం రావాడ, కృష్ణాపురం గ్రామాల్లో పొలంపిస్తోంది కార్యక్రమం చేపట్టారు.

● ఆమదాలవలస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీని వాసాసాచార్యులపేటలో లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో మెట్ట మోహన్‌రావు పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజ మాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యేలు అన్నారు. పల్లెపండగ కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.


పొందూరు: రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పల్లె పండగతో ప్రగతి: రవికుమార్

పొందూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో పల్లెలు ప్రగతి పథాన నడవనున్నాయని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మంగళవారం పొందూరు, తండ్యాం, కృష్ణాపురం, నందివాడలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మన్మధరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఈవో మోహన్‌బాబు, ఎంపీపీ కె.ఉషారాణి, టీడీపీ నాయకులు కూన సత్యనారాయణ, సీహెచ్ రామ్మోహన్, అన్నెపు రాము, సీపాన శ్రీరంగ, బలగ శంకరభాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం: అశోక్

ఇచ్ఛాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మంగళవారం కొఠారి పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నాయకులు దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, కామేష్, పద్మనాభం, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి పాల్గొన్నారు.

రూ.32 కోట్లతో పనులు: శంకర్

శ్రీకాకుళం రూరల్/గార, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రూ. 32 కోట్లతో రోడ్లు, కాలువలు పనులు చేపట్టనున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. రూరల్ మండలం తండ్యేంవలస, సిలగాం సింగువలస, అలికాం, భైరివానిపేట, గార మండలం కళింగపట్నం, కె.మత్స్యలేశం, బందరువానిపేట, వమరవెల్లి, తోణంగి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మూకళ్ల శ్రీనివాసరావు, సీర రమణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు పూర్వ వైభవం: ఎంజీఆర్

హిరమండలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామాలకు పూర్వవైభవం తీసుకువస్తామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. 'పల్లె పండగ'లో భాగంగా మంగళవారం చవితి సీది, పిండ్రువాడ కాలనీ, మహాలక్ష్మిపురం, అంబావల్లి, నీలాదేవిపురం, కిట్టాలపాడు, భగీరథపురం గ్రామాల్లో బీటీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, తూలుగు తిరుపతిరావు, యాళ్ల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం: బగ్గు

జలుమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. లింగాలవలస నుంచి ఉసిరికిజోల వరకు, మర్రివలస నుంచి మాకివలస వరకు, జలుమూరు నుంచి వెంకటాపురం మీదుగా బుడితి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. స్వగ్రామం మర్రివలసను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, తహసీల్దార్ జె.రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, వెలమల రామారావు, చంద్రభూషణ పాల్గొన్నారు.


శ్రీకాకుళం రూరల్: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


హిరమండలం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


ఇచ్ఛాపురం: కొఠారిలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్


జలుమూరు: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

టీడీపీ కార్యకర్త హత్యకేసులో మరో నలుగురి అరెస్ట్

నరసన్నపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలాకి మండలం వనవిష్ణుపురంలో ఈనెల 8న అమ్మవారి వారాల రోజున జరిగిన ఘర్షణలో టీడీపీ కారకర్త పాలిన వీరాస్వామిపై దాడిచేసి హతమార్చిన కేసులో మంగళవారం మరో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసులో ఏ2 పాలిన మోహనరావు, ఏ3 పాలిన శ్యామసుందరారావు, ఏ9 ఇప్పిలి కోటేశ్వరరావు, తులగాన లచ్చయ్య, ఏ12 తులగాన లవన్నలను అరెస్ట్ చేశామన్నారు. ఈనెల 10న ముగ్గురిని, 11న నలుగురిని అరెస్ట్ చేశామని, మొత్తం ఇప్పటి వరకు 11 మందిని అరెస్ట్ చేయగా, మరో వ్యక్తిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.

దేవీ విగ్రహం నిమజ్జనంలో అపశ్రుతి

● అక్కయ్యపాలెంలో యువకుడి మృతి


నవీన్ (ఫైల్)

రణస్థలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కయ్యపాలెంలో సోమవారం రాత్రి జరిగిన దుర్గాదేవీ బొమ్మ నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన యువకుడు దాన నవీన్ (21) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. అక్కయ్యపాలెం సమీపంలోని ఎర్రచెరువులో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అనంతరం పక్క గ్రామంలో జరిగిన కార్యక్రమానికి వెళ్లారు. ఆ కార్యక్రమానికి నవీన్ వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. అయితే మంగళవారం ఉదయం వరకు నవీన్ రాకపోవడంతో అనుమానం వచ్చి నిమజ్జనం చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద చూడగా విగ్రహం కింద నవీన్ మృతదేహం ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. తండ్రి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పందించారు.. ప్రాణాలు కాపాడారు

● పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి


పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మావూరి వీధికి చెందిన గుంటముక్కల శివప్రసాద్ సోమవారం రాత్రి పొన్నాడ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా పోలీసులు స్పందించి ప్రాణాలు కాపాడారు. అదే సమయంలో విధులు నిర్వహిస్తున్న వన్‌టౌన్ పోలీసు సిబ్బంది పొన్నాడ వంతెన కిందకు దిగి నీటిలో మునిగిపోతున్న శివప్రసాద్ ఒడ్డుకు చేర్చి రక్షించారు. ఈ మేరకు శివప్రసాద్‌కు హెచ్‌సీ టి.అమ్మాజీ కౌన్సెలింగ్ చేశారు. చావు ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదని, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు నష్టాన్ని కలిగిస్తాయని వివరించారు. అనంతరం పోలీసు వాహనంపై ఆయన ఇంటికి తీసుకువెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు సమయస్ఫూర్తితో వ్యవహరించి శివప్రసాద్ ప్రాణాలు కాపాడిన హెడ్ కానిస్టేబుల్ టి.అమ్మాజీ, ఆర్మ్‌రిజర్వ్ పోలీసు కానిస్టేబుల్ చంద్రశేఖర్, మహిళ హోంగార్డు నారాయణమ్మలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి నగదు పురస్కారం అందించి అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ క్రైం పి.శ్రీనివాసరావు, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపు నాయుడు, ఎస్‌ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

వంశధారలో స్నానానికి దిగి బాలుడి మృతి


రంజిత్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం పొన్నాం గ్రామానికి చెందిన ఓ బాలుడు వంశధార నదిలో స్నానానికి దిగి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పొన్నాం గ్రామానికి చెందిన బైరి రంజిత్ కుమార్(17) వంశధార నదిలో సోమవారం ఉదయం స్నానానికి దిగి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు వెతికారు. రూరల్ పోలీసులు సైతం అక్కడికి చేరుకుని గజ ఈత గాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం మృతదేహం లభ్యం కావడంతో రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు రంజిత్ కుమార్ తండ్రి చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ కిషోర్ వర్మ కేసు నమోదు చేశారు.

ఇసుక నిల్వలు సీజ్

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దూసి రోడ్డు జంక్షన్, రాగోలు జెమ్స్ ఏరియాతో పాటు ఐదు ప్రాంతాల్లో ఉన్న ఇసుక నిల్వలను సీజ్ చేసినట్లు శ్రీకాకుళం తహసీల్దార్ గణపతిరావు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలించి కుప్పలుగా వేసి నిల్వలు ఉంచిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్ మంగళవారం రాత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ గణపతిరావు రూరల్ ఎస్‌ఐ కిషోర్ వర్మతో కలిసి అక్కడకు చేరుకుని ఇసుక అక్రమ నిల్వలను గుర్తించి సీజ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పలాసరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పలాస పట్టణం సీతారామ్ నగర్‌కు చెందిన తిప్పన మురళి(36) శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మురళి బైక్‌పై సోమవారం రాత్రి గొప్పిలి వెళ్లి తిరిగి పలాసకు వస్తుండగా అల్లుకోల గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం జరిగి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుణ్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి ఉన్నత చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ధనలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమపోటు నివారణకు చర్యలు

కోటబొమ్మాళి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో దోమపోటు ఎక్కువగా సోకిందని, దీని నివారణకు బుప్రో ఫిజన్ మందును 350మిల్లీ గ్రాముల ఒక ఎకరాకు పిచికారీ చేయాలని టెక్కలి వ్యవసాయశాఖ ఉప సంచాలకులు బీవీ తిరుమలరావు అన్నారు. మంగళవారం నారాయణవలస పంచాయతీలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో ఎస్. గోవిందరావు, వీఏఏ ఎం.మాధవి, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో చీడపీడల నివారణ

మెళియాపుట్టి,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా చీడపీడలను నివారించవచ్చని ఏడీఏ మధుబాబు అన్నారు. భరణికోట, కరజాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది మంగళవారం నిర్వహించారు. వరి పంటకు సుడిదోమ, సోకుతున్నందున తగు జాగ్రత్తలను వివరించారు.

రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట జాబితాలు

నరసన్నపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాలను ప్రదర్శించడం జరిగిందని ఏవో సునీత అన్నారు. మంగళవారం మడపాం రైతు సేవా కేంద్రంలో జాబితాలను అతికించారు. ఈ జాబితాల్లో అభ్యంతరాలుంటే వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

నందిగాం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ నమోదు వివరాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏవో పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మంగళవారం పెద్ద బాణాపురం, కవిటి అగ్రహారం గ్రామాల్లో 'పొలంపిలుస్తోంది' నిర్వహించారు. వరికి సోకుతున్న తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

కొత్తూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పారాపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ లోపింటి రవి వేతనదారుల నుంచి వసూళ్లకు పాల్పడ్డారని కలెక్టర్‌కు గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఉపాధి ఏపీడీ పి.రాధ గ్రామంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుల నుంచి స్టేట్ మెంట్ రికార్డు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఆమె తెలి పారు. కార్యక్రమంలో ఏపీవో ప్రేమ లత, సర్పంచ్ రత్నాలు, పీవో భాస్కరరావు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

పీజీలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

నరసన్నపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతనంగా మంజూరైన పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిం దని ప్రిన్సిపాల్ పి.లత ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 21లోగా కళాశాలను సంప్రదించాలని కోరారు.

టెట్‌కు 73 మంది గైర్హాజరు

నరసన్నపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం కోర్ టెక్నాలజీ కేంద్రంలో ఉదయం 330 మంది అభ్యర్థులకు గాను 291 మంది హాజరయ్యా రు. మధ్యాహ్నం 330 మంది గాను 296 మంది పరీక్షలు రాశారు. మొత్తం 660 మందికి గాను 73 మంది గైర్హాజరయ్యారని పర్యవేక్షకుడు, ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు.

నేడు నీలమణిదుర్గ ఆలయ హుండీ లెక్కింపు

పాతపట్నం అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనీలమణిదుర్గ ఆలయ హుండీల లెక్కింపు బుధవారం చేపడుతున్నట్లు ఈవో టి.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరుగు లెక్కింపులో ఆసక్తి ఉన్న భక్తులు డ్రస్‌కోడ్ పాటించి పాల్గొనవచ్చన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

సంతబొమ్మాళి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బోరుభద్రలో భూ ఆక్ర మణలను రెవెన్యూ అధికారులు మంగళ వారం పరిశీలించారు. గ్రామానికి చెందిన గుడ్ల వైకుంఠరావు, గుడ్ల నర్సింహమూర్తి సచివాలయం పక్కన ప్రభుత్వ భూమితో పాటు బంజరు చెరువు సమీపంలో ఆక్రమణ లకు పాల్పడ్డారని ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో స్థానిక నాయకుడు చింతాడ చిన్నారావు ఫిర్యాదు చేశారు. డీటీ హరి, ఆర్‌ఐ లక్ష్మీప్రసన్న, వీఆర్వో హరిబాబు సదరు ఆక్రమిత ప్రదేశాలను పరిశీలించారు. సచివాలయం పక్కన ఉన్న భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించామని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని డీటీ తెలిపారు.

20న రైతు సమస్యలపై సదస్సు

హరిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై హరిపురంలో ఈనెల 20న సద స్సు నిర్వహిస్తున్నట్లు పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు తెలిపారు. మంగళవారం మార్పు ట్రస్టు భవనంలో కరపత్రాలను ఆవిష్కరించారు. నల్ల హడ్డీ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కడపలగెడ్డ అభివృద్ధి ఎప్పుడు?

రైతుల కష్టాలు తీరేదెన్నడు?


ఆక్రమణలకు గురైన కడపలగెడ్డ

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దబ్బపాడు, తురకపేట, సుమంతాపురం గ్రామాల పంట పొలాలకు సాగునీరందించే కడపలగెడ్డ అభివృద్ధి పనులు ఎప్పుడు జరుగుతాయోనని ఆయా గ్రామాల రైతులు ఎదురు చూస్తున్నారు. కాలువ అభివృద్ధి జరిగితే సుమారు 200 ఎకరా లకు సాగునీరందే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం గెడ్డ చుట్టుపక్కల ఆక్రమణలకు గురి కావడంతో కుంచించుకుపోయి దిగువ ప్రాంతాలకు నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయకట్టు రైతులు సాగునీరందక ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వర్షాకాలంలో కురిసిన భారీవర్షాలకు హిరమండలం మండలం సరిహద్దు గ్రామాలైనటువంటి స్కాట్‌పేట, మోదుగవలస తదితర గ్రామాలతో పాటు కొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కొండవాగు నీరుకూడా ఈ కడపలగెడ్డ ద్వారా దబ్బపాడు గ్రామ సమీపంలోని వంశధార నదిలోకి చేరుతుంది. అలాంటి పరి స్థితుల్లో గెడ్డ విస్తీర్ణం లేకపోవడంతో పంటపొలాల గుండా ప్రవహించిన నీటితో ఏడాదికి ఒకసారి పండించే వరి పంటలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కడపలగెడ్డను అభివృద్ధి చేస్తే సాగునీరంది పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నిర్వహించనున్న ప్రజాదర్బార్‌లో ఈ సమస్యపై పరిష్కారం మార్గం చూపాలని వారు కోరుతున్నారు.

రైతుల ఆచారాలకు ప్రతీక పత్రికొమ్మల వేడుక


బోరుభద్రలో పత్రి వారాలు నిర్వహిస్తున్న రైతులు

జలుమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజమాసం అష్టమి నుంచి పౌర్ణమి వరకు రైతులు గ్రామాల్లో పత్రికొమ్మల పండగను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అబ్బాయిపేటలో ఈ ఉత్సవం చేపట్టారు. ఈ కొమ్మలను పొలాల్లో వేయడం ద్వారా పంటలు సమృద్ధిగా పండుతాయని రైతుల నమ్మకం. అమ్మవారికి ముర్రాటలు సమర్పించి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకుంటారు.

ఘనంగా దసరా వారాలు

సంతబొమ్మాళి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో దసరా పత్రి వారాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోరుభద్ర, వడ్డివాడ, గొదలాం, పాల తలగాం గ్రామాలతో పాటు పలు మత్స్యకార గ్రామాల్లో పత్రి కొమ్మలకు వేటలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పూజారులు ప్రియా భాగెన్నాయుడు, రామచంద్రరావు అమ్మవారి దండకాలు చదివారు.

ఆదివాసీల హక్కుల ఉద్యమనేత సాయిబాబా


మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘ అధ్యక్షుడు పత్తిరి దానేసు

పలాసరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమబాట పట్టిన వ్యక్తి ప్రొఫెసర్ సాయిబాబా అని వక్తలు అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘ అధ్యక్షుడు పత్తిరి దానేసు మాట్లాడుతూ.. సాయిబాబా జీవితమంతా పోరాటాలతోనే సాగిందని, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా ఆదివాసీల రక్షణకు నిరంతర పోరాటం చేశారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా తాను నమ్ముకున్న సిద్ధాంతాలను చివరి వరకు వదిలిపెట్టలేదన్నారు. ఆయన మృతి పోరాటాలకు తీరని విఘాతమన్నారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు బాలకృష్ణ, పీవోడబ్ల్యూ సంఘ నాయకురాలు కుసుమ, సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకుడు ఎం.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిలకమ్మకు అరటి గెలలతో నివేదన


చిలకమ్మతల్లి ఆలయానికి కట్టిన అరటిగెలలు

దీర్ఘాశి(పోలాకి) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిలకమ్మతల్లి పేరంటాలు ఉత్సవం మంగళవారం దీర్ఘాశి మెండ, పల్లి వీధులు ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి అరటి గెలలు కట్టి భక్తిని చాటుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి, ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామ దేవత అసిరితల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పల్లి మూగెన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ

వజ్రపుకొత్తూరు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన డోకులపాడులో మంగళవారం పాతపట్నం, మరిడమ్మోరు, చండమ్మొరు అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు, ఆలయాల శిఖర పూర్ణ కలశ స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు.


ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

డిస్లెక్సియా విద్యార్థులను గుర్తించాలి

నరసన్నపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యను నేర్చుకునే విభిన్నతలు కలిగిన విద్యా ర్థులను గుర్తించాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు సూచించారు. ప్రభుత్వం ప్రతి ఏటా అక్టోబరులో డిస్లెక్సియాపై చేపడుతున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. మెదడు సంబంధిత పరిస్థితిని కలిగిన విద్యార్థులు నేర్చుకునే విభిన్నతలను అర్థం చేసుకొని వారికి మద్దతు ఇవ్వాలన్నారు. డిస్లెక్సియా విద్యార్థులు చదవడం, రాయడంలో వెనుకపడతారని, అయితే మేధా స్థాయి మిగతా వారికంటే ఎక్కువ కలిగి ఉంటారన్నారు. ఉపాధ్యాయులు, ఐఈడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో..

సంతబొమ్మాళి,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) విద్యార్థుల్లో అభ్యాసక వైకల్యాలు, డిస్లెక్సియాపై సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం అవగాహన కార్య క్రమం చేపట్టారు. సర్వ శిక్షాభియాన్ అధికారుల ఆదేశాల మేరకు ర్యాలీ చేపట్టినట్లు ఎంఈవోలు జలుమూరు చిన్నవాడు, డి.అర్జునుడు తెలిపారు. కార్యక్ర మంలో హెచ్‌ఎం కామరాజు, ఐఈఆర్టీ రాంబాబు, భాస్కరరావు పాల్గొన్నారు.

నందిగాంలో..

నందిగాం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డిస్లెక్సియా వారోత్సవాల సందర్భం గా మంగళవారం నందిగాంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. భవిత కేంద్రం ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టి అభ్యసన సామర్థ్యాలను పెంచుదాం, నిర్దిష్ట వైఫల్యాలను గుర్తిద్దాం అంటూ నినదించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైహరిబాబు, జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ మోహనరావు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

హరిపురంలో..

హరిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే విద్యార్థుల్లో అభ్యసన సమస్యను అధిగమిద్దామని హెచ్‌ఎం తేజేశ్వరరావు అన్నారు. అభ్యసన సమస్య (డిస్లెక్సియా) మాసోత్సవం సందర్భంగా ఎస్ఎస్ఏ ఆదేశాలతో హరిపురం హైస్కూల్‌లో భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు ప్రసాదరావు, అంబిక, ఉపాధ్యాయులు సాంబమూర్తి, కృష్ణారావు, పి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్‌పేటలో..

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం కలిగిన విద్యార్థులు చద వడం, రాయడంలో వెనుకబడి ఉంటున్నారని, ఈ సమస్యను అధిగమిం చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని హెచ్‌ఎం సింహాచలం అన్నారు. ఎస్ఎస్ఏ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం లక్ష్మీనర్సుపేటలో భవిత కేంద్రం ఆధ్వర్యం లో డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ చేప ట్టారు. అభ్యసన వైకల్యంపై గ్రామాల్లో అవగాహన కలిగించడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించవచ్చన్నారు. స్కూల్ అసిస్టెంట్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచరు ఎం.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా డైరెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం విద్యార్థులకు డిస్లెక్సియాపై అవగాహన కల్పించినట్లు ఎంఈవోలు దేవేంద్రరావు, పద్మనాభరావు అన్నారు. మంగళవారం మెళియాపుట్టి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేప ట్టారు. హెచ్‌ఎం గణపతిరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

జలుమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం గ్రామం వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీముఖలింగానికి చెందిన కుంచాల వెంకటరమణకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొమనాపల్లి నుంచి శ్రీముఖలింగం ద్విచక్రవాహనంపై వెళుతున్న వెంకటరమణకు వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుణ్ని శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించినట్లు ఈఎంటి మురళీ, పైలెట్ పాపారావు తెలిపారు. అయితే ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

ఉత్తమ విలన్ అవార్డుకు నాయక్ ఎంపిక


కుమార్‌నాయక్

పలాసరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో గురువారం ఇండియన్ ఫిలిమ్ మేకర్స్ నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివల్‌కి సినీనటుడు కుమార్ నాయక్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎవడి సినిమాకు వాడే హీరో' సినిమాలో విలన్ పాత్రలో విశేష ప్రతిభ కనబర్చి నందుకు ఉత్తమ విలన్‌గా తనను ఎంపిక చేసి నట్లు నిర్వాహకులు హెచ్‌ఆర్ దిలీప్ కుమార్ నుంచి వర్తమానం అందిందన్నారు.